## మన(సు)లో మాట

పాఠకులకు విజయదశమి శుభాకాంక్షలు. మీ అందరి ఆశీర్వాదముతోను, శుభాకాంక్షలతోను సంఘమిత్ర తెలుగు త్రైమాసిక పత్రిక నాలుగు సంవత్సరములు పూర్తి చేసుకున్నది. శ్రీనివాసరామానుజన్ మేధమేట్రిక్స్ క్లబ్ మరొక విజయవంతమైన సంవత్సరమును పూర్తి చేసుకుని, మేధావధానము కార్యక్రమముతో ముగించింది. కౌముది ఆన్‌లైన్ మాసపత్రిక మేధవధానం గురించి వివరముగా ఒక వ్యాసము ప్రచురించింది. ఇందులో ఈ 'క్లబ్ మొదలుపెట్టడానికి స్ఫూర్తినిచ్చిన పరిస్థితులను గురించి', 'అందుకున్న మైలు రాళ్ళ గురించి', 'సంస్థ ఆశయాల గురించి' ప్రస్తావించబడింది. మేధావధానమును గురించి 'ఇండియా పోస్ట్' వారపత్రికలో ఆగష్టు 15వ తేదీన ప్రచురితమైనది. మేధావధానమునకు సంబంధించిన విశేషాలు 'ప్రవాసాంధ్రుల పేజీ'లో చూడవచ్చు.

సంఘమిత్రలో ప్రచురించడానికి వివిధ శీర్షికలకు వ్యాసములను ఆహ్వానిస్తున్నాము. ఉత్తమమైన రచనలకు, వ్యాసములకు సంఘమిత్ర బహుమతులను కూడా అందించాలని తలపెట్టింది. ఉత్సాహమున్న పాఠకులు మీ మీ రచనలను సంఘమిత్ర చిరునామాకు పంపడముద్వారా గాని, ఈ-మెయిలు ద్వారాగాని పంపవలసినదిగా మనవి. మన పండుగలను గురించిన విశేషములు (మన పండుగలు - ప్రాశస్త్యము), చరిత్రలోస్థానమును ఏర్పరచుకొన్న మన పూర్వీకులను గురించి (చరిత్రకెక్కిన చరితార్థులు), వివిధ సంస్థలు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమములగురించి (ప్రవాసాంధ్రులపేజీ) వ్రాసేవారికోసం చూస్తోంది. ఇంతే కాకుండా మీరు పంపే విషయము నలుగురికి ఉపయోగపడుతుందని మీరు అనుకుంటే, ఆ వ్యాసమునుగాని, రచనను గాని మాకు పంపండి. దానిని నలుగురికి తెలియజేసే బాధ్యత సంఘమిత్ర తీసుకుంటుంది.

సంఘమిత్రలోని వివిధ శీర్షికలు బాగున్నాయని, బాలమిత్ర పిల్లలకు బాగా నచ్చుతున్నదని, ఇంకా పేజీలు పెంచమని, జనపథం - జనపదంలో ప్రచురించే అంశాలు మిగతా వాటికంటే భిన్నంగాను, మన ప్రవర్తనను చక్కగా మలచుకోడానికి ఉపయోగపడుతున్నాయని, ఆచారములు - అంతరార్థములు శీర్షిక ఎన్నో తెలియని విషయములను తెలుసుకునే అవకాశము కల్పిస్తున్నదని, సామెతకథలు - సామెత ఏర్పడడానికి దోహదపడిన సంఘటనలను తెలియజేస్తూ ఎంతో ఆసక్తిదాయకముగాను, దేనికదే సాటి అన్నట్లున్నాయని తెలియజేసిన పాఠకుల అభిప్రాయానికి ధన్యవాదములు. మీరు పంపిన అభిప్రాయాలు పత్రిక నాణ్యత మరింత పెరగడానికి దోహదపడతాయన్నది వాస్తవం. మీ అభిమానమే పత్రిక గమనానికి శ్రీరామరక్ష!

మళ్ళీ జనవరి సంచికలో కలుద్దామా! అంతవరకు సెలవు. అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.